సీమ వార్త సాయంకాలం

గురువారం
27 ఆగస్టు 2026

## సర్జరీ బేబీని పరామర్శించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు.





**గోరంట్ల ఆగస్టు 27 సీమ వార్త సాయంత్రం.** పాలసముద్రం ఆదర్శ ప్రాథమిక పాఠశాల నందు మూడో తరగతి చదువుతున్న కుమారి మల్లెపూల చరణ్య ఈనెల 15 న పాలసముద్రం గ్రామం నందు నూతనంగా ఏర్పాటు చేసిన పార్క్ లో పిల్లలందరితో కలసి సాయంత్రం వేళ గుండ్రంగా తిరిగే రాట్నం నందు ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు తల వెంట్రుకలు చిక్కుకొని తలకు తీవ్రమైన గాయం అయింది. అనంతరం విద్యార్థినిని బెంగళూరు నందు ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో చేర్పించడం జరిగింది. సర్జరీ జరిగిన అనంతరం బేబీ చరణ్య పాలసముద్రంలో గల తమ స్వగృహం నందు విశ్రాంతి తీసుకుంటున్నది. గురువారం రోజున ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలం అశోక్ మరియు ఉపాధ్యాయులు జయచంద్ర నాయక్ , నాగ లీల, సంప్రీతి బాయి , సునంద లు విద్యార్థిని చరణ్యను పరామర్శించి , విద్యార్థినికి మరియు తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి , తమ వంతు సాయంగా 5000 రూపాయలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థి కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మేర రేషం -- మేర అభిమాన్ ।

## నా పట్టు -- నా అభిమానం

**బుల్ల సముద్రం గ్రామంలో పట్టు రైతులకు అవగాహన కార్యక్రమం**



**మడకశిర ఆగస్టు 27 సీమ వార్త సాయంకాలం** మండల పరిధిలోని బుల్లసముద్రం గ్రామంలో గురువారం మేర రేషం -- మేర అభిమాన్ । నా పట్టు -- నా అభిమానం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టు రైతులతో కలిసి పట్టు పరిశ్రమ అభివృద్ధి, రైతులకు ఎదురవుతున్న సమస్యలు, పట్టు సాగులో ఆధునిక పద్ధతులు, నాణ్యమైన పట్టు ఉత్పత్తి వంటి అంశాలపై చర్చించారు. పట్టు సాగు ద్వారా రైతులకు మరింత మెరుగైన ఆదాయం వచ్చేలా ప్రభుత్వ శాఖల సహకారం, శాస్త్రీయ పద్ధతుల వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారులు రైతులకు పట్టు పురుగుల పెంపకం, మల్బరీ సాగు, నాణ్యమైన పట్టు ఉత్పత్తి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలు మరియు ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ డా. కే. శ్రీనివాసులు, జాయింట్ డైరెక్టర్ శోభారాణి, కేంద్ర పట్టు మండలం పరిశోధనా శాస్త్రవేత్త రమ్య, దీప, మడకశిర పట్టు పరిశ్రమ శాఖ ఏడి హనుమంత నాయక్, మండలం కన్వీనర్ నాగరాజు తో పాటు మడకశిర నియోజకవర్గానికి చెందిన పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, పట్టు రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన వాహనాలు బహిరంగ వేలం లో విక్రయం

.... స్థానిక పోలీసులు, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వేలాలు.



**డి హిరేహాల్ ఆగష్టు 27 సీమవార్త సాయంకాలం :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎక్సైజ్ కేసులకు సంబంధించి సీజ్ చేసిన ఐదు వాహనాలను అధికారులు బహిరంగ వేలంలో విక్రయించారు. అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు, జిల్లా ఎక్సైజ్ అధికారి సూచనలతో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డి.హిరేహాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేలం నిర్వహించారు. వేలంలో మొత్తం ఐదు వాహనాలు విక్రయించారు. నిర్ణయించిన కనీస ధర కంటే సుమారు 45 శాతం అధికంగా రూ.28,910కు అధిక బిడ్ దక్కించుకున్న వారికి వాహనాలు కేటాయించారు. రెండు ఎక్సైజ్ కేసులకు సంబంధించి సీజ్ చేసిన మద్యాన్ని నిబంధనల ప్రకారం ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డి.హిరేహాల్ ఎస్ఐతో పాటు ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## డీలర్ల సమస్యలు తీర్చాలని కోరుతూ ఆర్డిఓ, తహసిల్దార్ కు వినతి



**మడకశిర ఆగస్టు 27 సీమ వార్త సాయంకాలం** మండలంలో డీలర్ వ్యవస్థ గత నెల నుంచి క్యూఆర్ కోడ్ తో రేషన్ పంపిణీ విధానం తో చాలా ఇబ్బంది పడుతున్నారు .డీలర్లు లబ్ధిదారులు రేషన్ పంపిణీ చేసేటప్పుడు ప్రతి మూడు బస్తాలకు క్యూఆర్ కోడ్ చేయడం వల్ల డీలర్లకు చాలా ఇబ్బంది కలుగుతుంది. అందులోను అప్పుడప్పుడు సర్వర్ బిజీ నెట్ వర్క్ సమస్య వల్ల సకాలంలో మనం అందించే నిత్యవసర సరుకులు సకాలంలో అందించలేకపోతున్నాం తద్వారా మనకు పర్సెంటేజ్ కూడా చాలా తక్కువగా అవుతుంది. కనుక దయచేసి ఈ క్యూఆర్ కోడ్ స్కానింగ్ విషయంలో కొంచెం పై అధికారుల దృష్టికి తీసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని గురువారం ఆర్డీఓ నాగప్రసన్నలక్ష్మి, తహసిల్దార్ పూజారి ముకుందకు వినతిపత్రం సమర్పించారు. అలాగే గతంలో గత ప్రభుత్వంలో ఎం డి యు వ్యవస్థ ఉన్నప్పుడు చాలా అద్వానంగా పంపిణీ జరిగింది. కావున అలాగే జరిగే సూచనలు ఉన్నాయి. కనుక పై అధికారులకు ఈ సమస్యను తెలియజేయాలని మడకశిర రెవిన్యూ డివిజన్ అధికారికి , తాసిల్దార్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది అని డీలర్ల సంఘం అధ్యక్షుడు బొమ్మయ్య గారి చంద్ర తెలిపారు.

## బాడుగ బండికి రాం రాం... సవితమ్మ బండితో జీవనం.

బజ్జీల లీలావతి ఆర్థిక స్థితికి మంత్రి చలించి... పిలిచి బండినిచ్చి.

బాడుగ తోపుడు బండితో జీవనం.. సొంత బండి అందించిన మంత్రి సవిత






**గోరంట్ల ఆగస్టు 27 సీమ వార్త సాయంత్రం.** భర్తను కోల్పోయి, బాడుగ తోపుడు బండిపై బజ్జీలు విక్రయిస్తూ కుమారుడు, కుమార్తెను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్న లీలావతికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ అండగా నిలిచారు. బుధవారంవారం గోరంట్ల పట్టణంలో పర్యటించిన మంత్రి సవితమ్మను బస్టాండ్ సమీపంలో బాడుగ తోపుడు బండిపై బజ్జీలు విక్రయిస్తున్న లీలావతి కలిశారు. తన భర్త చనిపోయారని, బాడుగకు తోపుడు బండి తీసుకుని బజ్జీలు అమ్ముకుంటూ వచ్చే ఆదాయంతో కుమారుడు, కుమార్తెను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నానని మంత్రికి వివరించారు. బాడుగ బండితో ఇబ్బందులు పడుతున్నానని, తనకు సొంత తోపుడు బండి ఏర్పాటు చేసి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.లీలావతి పరిస్థితిని అర్థం చేసుకున్న మంత్రి సవితమ్మ వెంటనే స్పందిస్తూ "రేపు పెనుకొండ క్యాంపు కార్యాలయానికి వచ్చి కలవండి.. తప్పకుండా మీకు సొంత తోపుడు బండి ఏర్పాటు చేస్తాను"అని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గురువారం లీలావతిని పెనుకొండ క్యాంపు కార్యాలయానికి పిలిపించి, ఆమె జీవనోపాధికి ఉపయోగపడేలా సొంత తోపుడు బండిని మంత్రి సవితమ్మ అందజేశారు.సొంత తోపుడు బండి అందడంతో ఇకపై బాడుగ భారం లేకుండా వచ్చిన ఆదాయంతో తన పిల్లలను మరింత బాగా చదివించుకుంటానని లీలావతి తెలిపారు. తన పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే స్పందించి, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి సవితమ్మకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పేదలు, మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేలా వారికి అండగా నిలవడమే తమ లక్ష్యమని మంత్రి సవితమ్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో గోరంట్ల పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య కార్యకర్తపై పీడీ యాక్ట్

**గత ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనం: సోమశేఖర్ నాయుడు**



తాడిపత్రి, ఆగస్టు 26 సీమ వార్త సాయంత్రం: సామాన్య కార్యకర్తపై పీడీ యాక్ట్ పెట్టడం గత ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనమని తెలుగుదేశం పార్టీ కార్యకర్త పరిమి సోమశేఖర్ నాయుడు మండిపడ్డారు. తాను తెలుగుదేశం పార్టీ సాధారణ కార్యకర్తనని, నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ అస్మిత్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ కోసం పనిచేస్తూ, పాత్రికేయుడిగా గతంలో సేవలు అందించానని తెలిపారు. తనకు ఎలాంటి నేర చరిత్ర లేదన్నారు. అయినప్పటికీ గత ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తనపై 27.08.2023న పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి కడప కేంద్ర కారాగారంలో నిర్బంధించిందని, ఏడాది పాటు జైల్లోనే ఉంచాలని ప్రభుత్వ ఉత్తర్వులు నంబర్ 2116, తేదీ 30.10.2023న ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. దొంగలు, దోపిడీదారులు, రౌడీలపై పెట్టే పీడీ యాక్ట్ ను తనలాంటి సామాన్యుడిపై పెట్టడం దారుణమన్నారు. ఒక పాత్రికేయుడిగా, ప్రజా సమస్యలపై ప్రశ్నించే సామాన్య కార్యకర్త గొంతు నొక్కడానికి గత ప్రభుత్వం పీడీ యాక్ట్ ను అస్త్రంగా వాడుకుందని ఆరోపించారు. తన అరెస్టుతో తన కుటుంబం ఎదుర్కొన్న మానసిక వేదనకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత వైఎస్సార్సీపీ నేతలకు లేదని, అధికారంలో ఉన్నప్పుడు అక్రమ నిర్బంధాలు చేసి ఇప్పుడు బాధితులుగా నటించడం సరికాదు అని ధ్వజమెత్తారు. తాడిపత్రిలో ప్రజాస్వామ్యం లేదంటూ మాట్లాడే వైఎస్సార్సీపీ మాజీ శాసనసభ్యులు, జిల్లా అధ్యక్షులు, వారికి వత్తాసు పలికే మేధావులకు నాపై పెట్టిన పీడీ యాక్ట్ కక్ష సాధింపు కాదని నిరూపించే ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు.

## పర్యావరణ పరిరక్షణ కోసమే మొక్కల పెంపకం.

ఎస్సీ హాస్టల్ ఆవరణలో.....రామ్ జి ప్రోగ్రాం లో మొక్కలు నాటిన వైనం.

7 రోజుల్లో 16 ప్రాంతాల్లో విరివిగా మొక్కలు పెంపకం.

కార్యక్రమానికి హాజరైన... ఉపాధి హామీ పీడీ విజయ ప్రసాద్.



**గోరంట్ల ఆగస్టు 27 సీమ వార్త సాయంత్రం.** వికసిప్ భారత్ గ్యారంటీ రాజ్ గార్ ఆజీవిక మిషన్ గ్రామీణ్ కార్యక్రమాల భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా పిడి విజయ ప్రసాద్ చేతుల మీదుగా గోరంట్ల పట్టణంలోని ఎస్సీ హాస్టల్ ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు జిల్లా వ్యాప్తంగా 16 ప్రాంతాల్లో వారం రోజుల్లో మొక్కలు నాటడం పూర్తయిందని పర్యావరణ రక్షణ కోసం విరివిగా మొక్కలు పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాల చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పిడి విజయ ప్రసాద్, ఏపీ డి శివానంద నాయక్, ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప ఎంపీడీవో కమల భాయ్, ఉపాధి హామీ ఏపీఓ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే గేటు వద్ద రక్తపాతం - ముగ్గురు రౌడీలు అరెస్ట్

**అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదు - సీఐ నారాయణ రెడ్డి**



**తాడిపత్రి, ఆగస్టు 27 సీమవార్త సాయంత్రం :** తాడిపత్రి రూరల్ మండలం యల్లనూరు రైల్వే గేటు సమీపంలో జరిగిన హత్యాయత్నం కేసులో రక్త పాతం సృష్టించిన ముగ్గురు నిందితులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 22న పాత గొడవల నేపథ్యంలో సునీల్ కుమార్ పై పిడి కత్తులతో దాడి చేసి కుడి భుజంపై తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన నిందితులుగా ఉన్న మదన రమేష్ అలియాస్ రమేష్ నాయుడు (44), పెండ్యాల హేమంత్ కుమార్ అలియాస్ హేమంత్ చౌదరి అలియాస్ హేమంత్ నాయుడు (24), పత్తిపాటి నవీన్ కుమార్ అలియాస్ బబ్లు (26) లను గురువారం తేరన్నపల్లి క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన రెండు పిడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో తాడిపత్రి సబ్ జైలుకు తరలించినట్లు రూరల్ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. తాడిపత్రిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## వీణ: గురువు ఆశీర్వాదంతో నూతన బాధ్యతల్లోకి

**బీజేవైఎం కడప ఇన్చార్జి గంగాధర్ ను సన్మానించిన సందిరెడ్డి శ్రీనివాసులు**



**తాడిపత్రి, ఆగస్టు 27 సీమ వార్త సాయంత్రం:** భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) కడప జిల్లా ఇన్చార్జిగా నూతన బాధ్యతలు స్వీకరించిన గంగాధర్, తన రాజకీయ గురువు సందిరెడ్డి శ్రీనివాసులు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా సందిరెడ్డి శ్రీనివాసులు గంగాధర్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ, "నా రాజకీయ ప్రస్థానంలో గురువుగా, మార్గదర్శిగా, స్ఫూర్తిగా నిలిచింది సందిరెడ్డి శ్రీనివాసులు . గురువు చూపిన మార్గం నా బలం. కార్యకర్తల నమ్మకం నా బాధ్యత, పార్టీ బలోపేతమే నా లక్ష్యం" అని అన్నారు. కడప జిల్లా వ్యాప్తంగా యువతను భారీగా పార్టీలోకి ఆకర్షించి, యువమోర్చాను గ్రామ స్థాయి నుండి బలోపేతం చేస్తానని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. గురువు ఆశీర్వాదం ఉంటే గమ్యం ఎంత దూరమైనా అడుగులు ఆగవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి బీజేపీ నాయకులు నారాయణ స్వామి , యువమోర్చా కార్యకర్తలు పాల్గొని గంగాధర్ కు అభినందనలు తెలిపారు.

## తాడిపత్రి తైక్వాండో క్రీడాకారుల ప్రతిభకు జాతీయ గుర్తింపు

**అభినందించిన పెన్షనర్లు - క్రీడాకారులకు రూ.5,000 స్పాన్సర్**



**తాడిపత్రి, ఆగస్టు 27 సీమ వార్త సాయంత్రం : తాడిపత్రి పట్టణనికి చెందిన అయాన్ తైక్వాండో అకాడమీ క్రీడాకారుల ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అకాడమీకి చెందిన యశస్వి భారతి (యు-20), ఆరాధ్య (యు-16) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరూ అక్టోబర్ 3,4,5 తేదీలలో మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొననున్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు హనుమంత్ రెడ్డి, అధ్యక్షులు శివయ్య, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ మరియు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్య ప్రసాద్ క్రీడాకారులను ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారుల సేఫ్టీ కిట్ కోసం పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్య ప్రసాద్ రూ.5,000 స్పాన్సర్ చేయడం పట్ల అయాన్ తైక్వాండో అకాడమీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అయాన్ తైక్వాండో అకాడమీ మాస్టర్ సాయి మాట్లాడుతూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రోత్సాహం క్రీడాకారులకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చి జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన చేసేందుకు దోహదపడుతుందని, జిల్లాకు మంచి పేరు తీసుకొస్తారని అన్నారు.**

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881